

# గురుసాక్షాత్

తిమ్మన శ్యామసుందర నాయుడు

'ఈ కథ గురువుగారికి ఖచ్చితంగా నచ్చితీరుతుంది!'

అలా ఎన్నిసార్లనుకున్నానో తెలీదు గానీ, రాత్రి రాసిన కథని మరోసారి చదువుకుని బాగా వచ్చిందనిపించడంతో తృప్తిగా ఆయనింటివైపు నడిచాను.

పోయినవారం రాసిన కథలో ఆయనెన్నో తప్పులు చూపించారు. అందులో మొట్టమొదటిది కథావస్తువు. రెండవది కథకి నే నిచ్చిన ట్రీట్‌మెంట్ ... ఇంకా చాలా...

'ఈసారి గురువుగారి దగ్గర ఫూల్‌ని కాకూడదు!' అనుకుంటూ మరో పది నిమిషాల్లో ఆయనింటికి చేరుకున్నాను.

"రా, రా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను!" అన్నారు చుట్టని దూరంగా విసిరికొట్టి.

సాహిత్యరంగంలోకి అడుగుపెట్టి ఐదు వసంతాలైన నాకు, అరవై ఐదు వసంతాలు నిండిన ఆయన దగ్గరనుంచి తెలుసుకుంటున్న విషయాలు ఎంతో ఉపకరిస్తూంటాయి.

విశాలమైన ఫాలభాగం, జ్యోతుల్లా మెరిసే పెద్దపెద్ద కళ్ళు, పూర్తిగా పండిపోయిన జుట్టు, తెల్లని మీసాలు... గుండెవరకు పెరిగిన దట్టమైన వెడల్పాంటి గడ్డంతో రామాయణాన్ని రాస్తున్న వాల్మీకి మహామునిలా అనిపిస్తాడు నాకు ఆయన చేతిలో కలం పట్టుకునుంటే.

అందుకు తగ్గట్లుగా ఆ ఇంటి వాతావరణం ... రెల్లుగడ్డితో కప్పబడిన పూరి గుడిసె. చుట్టూ చెట్లు, ఊరికి దూరంగా ఉండటం వలన చేకూరిన అందంతో పర్ణశాల్లా ఉంటుంది.

నవ్వుతూ పలకరించి నేను రాసిన కథను ఆయన చేతిలో పెట్టి ఇంట్లోకి నడిచాను, దశాబ్దాలుగా కష్టపడి ఆయన సేకరించిన పుస్తకాల్లో ఒకదానిని తీసుకుందామని.

ప్రబంధాలు, కావ్యాలు, కవితా ఖండికలు, నవలలు, గ్రంథాలు ఒక క్రమంలో అమర్చబడిన ఆ పాత బీరువాలకేసి మురిపెంగా చూశాను. నెలకోసారైనా వాటిని నేనే బయటకు తీసి, దుమ్ము దులిపి మళ్లీ జాగ్రత్తగా సర్దుతుంటాను. వాటికి చెదలు పట్టకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంటూంటాను. అవే నా భవిష్యత్తుకు మార్గాన్ని

చూపే విజ్ఞాన సర్వస్వాలు కావడంతో వాటిని చాలా ప్రేమగా చూసుకుంటాను.

అరల్లో వరుస క్రమంలో అందంగా పేర్చబడిన వందలాది పుస్తకాల్లోంచి ఒక పుస్తకాన్ని తీశాను.

అది మను చరిత్ర !

దాన్ని తీసుకొచ్చి గురువుగారికి చూపించాను.

"మంచి పుస్తకం!" అన్నారు. అంటూనే, "ఏదో కథ రాసినట్లున్నావ్?" అనడిగారు.

"ఔను, గురూజీ! మానవతా విలువలమీద. అంతకుముందు రాసిన కథ బాగోలేదన్నారుగా. అందుకే దాన్ని పక్కన పడేసి మరొకటి..."

నా మాటలు పూర్తికాకముందే ఆయన "చాలా తప్పుపని చేశావ్. నేనా కథని బాగోలేదన్నానని దానిని పక్కన పడెయ్యడం కాదు నువ్వు చెయ్యాల్సింది. నేను ఎందుకు బాగోలేదన్నానో ఆలోచించాలి. నేను సూచించిన మార్పులతో మళ్లీ దాన్నే రాయడం చెయ్యాలి. అది పూర్తైన తరువాత మాత్రమే మరోటి ప్రారంభించాలి. లేదంటే ఏ రచననూ నువ్వు పూర్తిగా రాయలేవు!" అన్నారు మందలింపుగా.

నిజమే అనిపించింది నాకు. నా నిర్లక్ష్యానికి సిగ్గేసింది. మరోసారి అలా చెయ్యకూడదని మనుచరిత్ర మీద ఒట్టు పెట్టుకున్నాను.

ఆ తరువాత గురువుగారు నా కథ చదవడంతో నిమగ్నమైపోయారు. నేనూ ఆ కాసేపు మనుచరిత్ర తిరగేశాను.

కథ చదవడం పూర్తిచేసిన ఆయన కాగితాల్ని పక్కన పెట్టారు.

ఉత్సుకతతో ఆయనకేసి చూశాను ఏ అభిప్రాయాన్ని వెల్లడి చేస్తారా అని.

కథను బాగానే రాశాను. నచ్చుతుందనే నా నమ్మకం.

ఒక్క క్షణం కళ్లు మూసుకుని అన్నారు "నువ్వు చదవాల్సింది ఇంకా చాలా ఉందయ్యా!" అని.

అర్థమైంది. ఈ కథ కూడా గురువుగారికి నచ్చలేదు. చాలా నిరుత్సాహపడ్డాను.

గురువుగార్ని మెప్పించేలా ఎందుకని రాయలేకపోతున్నాను? కథ రాసినా, కవిత్వం రాసినా, మరోటి రాసినా బాగా రాశావని మాత్రం నన్నేనాడూ ఆయన మెచ్చుకోలేదు. నా కృషిలో లోపముందో? నా ఆలోచనల్లోనే లోపముందో?

"అయితే దీన్నే మళ్లీ ఇంకా బాగా రాయడానికి ప్రయత్నిస్తాను!" అంటూ నిస్సత్తువగా లేస్తూండగా గురువుగారు నా చేతిలో ఓ కరపత్రికను పెట్టారు.

అది ఉగాది కవి సమ్మేళనానికి సంబంధించినది. దాన్లో పాల్గొనమని కళ్లతోనే సూచించారు.

"మరి మీరు?" అనడిగాను.

ఆయన గడ్డం సవరించుకుంటూ చిరునవ్వు నవ్వి, "వసంతం పిలుస్తోంది... కొత్తదనాన్నే కాదు, కొత్త తరాన్ని కూడా!" అంటూ భుజం తట్టారు.

ఆ ప్రోత్సాహంతో మళ్లీ ఎక్కడ లేని ఉత్సాహం పొంగుకొచ్చింది నాకు. హుషారుగా అక్కణ్ణుంచి కదిలాను. ఈసారైనా గురూజీ అభినందనలు అందుకునే రీతిలో గొప్పగా రాయాలని.

000

ఆడిటోరియం సంవత్సరాది శోభతో కవులతో, కవయిత్రులతో, ఔత్సాహికులతో నిండిపోయి కళకళలాడుతూ ఉంది. మేము ప్రవేశించేసరికే ఎవరో కవితా గానాన్ని ఆలపిస్తున్నారు. మేమిద్దరం దూరంగా ఓ చోటికెళ్లి కూర్చున్నాము.

అయితే పాంచజన్యగారు వచ్చారని తెలియడంతో సభలో కలకలం బయలుదేరింది. ఒకరిద్దరు వచ్చి మర్యాదపూర్వకంగా గురూజీని పలకరించి వెళ్లారు.

ఓ నలుగురి తరువాత నా పేరు రావడంతో స్టేజ్ మీదకెళ్లి నా భావాన్ని రాగయుక్తంగా ఆలపించాను. సభలో కరతాళధ్వనులు మారుమోగాయి. ఎవరో వచ్చి నా కవిత్వాన్ని అభినందిస్తూ మెడలో పూలదండ వెయ్యడంతో ఆ గౌరవానికి ఉబ్బి తబ్బిబ్బయ్యాను. చాలా గర్వంగా ఆడియన్స్ మధ్యనుంచి నడుచుకుంటూ వెళ్లి గురువుగారి పక్కన కూర్చున్నాను. నా కవిత గురించి ఏ అభిప్రాయమిస్తారోనని చూశాను.

ఆయనేం మాట్లాడలేదు. పైగా ఆ తరువాత రాబోయే కవి గురించి ఎదురు చూస్తూండడంతో చిన్నబోయాను.

'ఒక్కసారి మెచ్చుకుంటే ఆయన సొమ్మేం పోయిందో?' మొట్టమొదటిసారిగా ఆయన మీద కోపం కలిగింది నాకు.

కార్యక్రమం అయిపోయిన తరువాత ఇంటికి బయలుదేరుతూ అన్నారు. నా కవిత చాలా సాధారణ స్థాయిలో ఉందని, భావుకత తగినంత పరిమాణంలో లేదని.

ఎంతో కష్టపడి రాసిన కవితలో సైతం ఆయన లోపాలు చూపించడంతో చాలా బాధ కలిగింది నాకు. ఇకనుంచి ఏది రాసినా ఆయనకు చూపించకూడదనిపించింది.

ఆ చీకట్లో నాతో అడుగులేస్తూ నాకు కవిత్వంలోని లోపాల్ని సరిదిద్దుతూ ఆ కవితను ఎలా రాస్తే బాగుంటుందో చాలా ఓపిగ్గా చెప్పారు.

అయినా ఆయన మీద కోపం పోలేదు నాకు.


ఆ తరువాత కొన్నాళ్లు ఆయన దగ్గరకు వెళ్లకుండా మనసంతా కేంద్రీకరించి నా సాహితీ సామర్థ్యాన్ని మొత్తం గుప్పించి గురువుగారి ప్రశంసను తప్పనిసరిగా పొందాలని ఎంతో పట్టుదలతో ఒక కథానికను రాశాను. రేయింబవళ్లు శ్రమించి దానికో తుది రూపాన్నిచ్చి ఓ సాయంత్రం ఆయనింటికెళ్లాను.

నేను వెళ్లే సమయానికి ఆయన బాగా

## బిగ్ బీ బనేంగే కరోడ్‌పతి!

వెండితెర మీద ఓ వెలుగు వెలిగిన బిగ్ బీ అమితాభ్‌బచ్చన్ కొంతకాలం నుంచి స్టార్‌ప్లస్‌లో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' సీరియల్ నిర్వహిస్తున్నట్లు తెలియనివారు లేరు. ఎవరు కోటీశ్వరుడైనా, కాకపోయినా అమిత్‌జీ మాత్రం కావడం తథ్యం! ఈ కార్యక్రమాన్ని చూసినవారిలో చాలామంది అతను 'బోర్‌పతి'గా తయారయ్యానారని వ్యాఖ్యానిస్తున్నారు. ఎందుకంటే ఇంతవరకూ ఒక్కరికే ఆ అదృష్టం పట్టింది. నిజానికి ఆ కోట్లేవో కావలసింది అమిత్‌జీకేననీ, ఏబిసీఎల్ సంస్థ బాగా నష్టాల్లో వున్నందున తానే కరోడ్‌పతి కావడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టారనీ అనుకుంటున్నారు. తనఖా పెట్టిన తమ బంగళాను ఇటీవలే విడిపించుకున్న బిగ్‌బీ, అతిత్వరలోనే మునుపటి వైభవాన్ని సంతరించుకోవడం జరిగితీరుతుందంటున్నారు. ఎపిసోడ్‌కు ఐదులక్షల చొప్పున స్టార్‌ప్లస్ వారు చెల్లిస్తున్నారట. నెలకు ఎనభైలక్షలంటే తక్కువ డబ్బేం కాదుమరి!

ఎస్.



దగ్గుతున్నారు. ఆయాసంతో బాధపడుతూ అలాగే మంచంమీద పడుకున్నారు. ఆయన్నా పరిస్థితిలో చూసి చలించిపోయాను. దగ్గరకెళ్లి మంచం దగ్గరగా స్టూల్ లాక్కుని కూర్చుని ఆరోగ్యం ఎలా ఉందని ప్రశ్నించాను. ఆయనా పరిస్థితిలో కూడా చిరునవ్వుతో అడిగారు "కొత్తదేమైనా రాశావా?" అని.

ఆయన్నా పరిస్థితిలో మాట్లాడించలేక విశ్రాంతి తీసుకోమని చెప్పి వచ్చేశాను.

మీదవడ్డ వృద్ధాప్యం, ఉడిగిపోయిన జవసత్వాలు పని చెయ్యలేని పరిస్థితిని కల్పించి, గురువుగారికి అప్పుల్ని కూడా ఆర్జించాయి. ఒకటికి రెండుసార్లు ఆర్థిక సహాయాన్ని అందించబోతే మృదువుగా తిరస్కరించారు. పైగా మరోసారి అటువంటి ప్రయత్నం చెయ్యొద్దని హెచ్చరించారు కూడా.

"పోనీ, ఏదన్నా రాసి పత్రికలకి పంపించండి, వాళ్లూ కొంత రెమ్యూనరేషన్ ఇస్తారు కదా!" అంటే, "ఇన్ని సమస్యల మధ్య సాహిత్యాన్ని బ్రతికించడం అసాధ్యమయ్యా!" అంటారు.

వదవికి ప్రశాంతత చేకూరినప్పుడు మాత్రమే కలానికి బలం చేకూరుతుందని అప్పటిదాకా తెలీదు నాకు.

ఇలా రాయగల సమర్థత ఉండి కూడా కనుమరుగైపోతున్న రచయితలెందరో?!

రచయిత పాఠకుల హృదయాల్లో ఎల్లకాలం నిలిచిపోవాలంటే అతను నిరంతరం రాస్తూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందిప్పుడు. గతంలో అతను రచించినవి గతం గతః అయిపోగా, మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కొత్త ట్రెండ్స్‌ను ప్రవేశపెడుతూ రచనలు చేయాల్సిన కాలమిది. ఈపోటీని తట్టుకుంటూ పాతతరం రచయితలు ...??

"నువ్వు రోజూ వచ్చి చర్చించే సాహిత్య విషయాలే నాకీమాత్రం ఆరోగ్యాన్నైనా ఇవ్వగలుగుతున్నాయి, శ్రీహర్షా!" అని ఆయన అప్పుడప్పుడూ అంటూ ఉంటారు. అదే నాకు కొంత ఊరటనిస్తూ ఉంటుంది.

ఆరోగ్యం బాగోకపోవడం వల్లనే ఆయన బయటకు రావడం కూడా తగ్గించారు. ఆ తరువాతే ఊళ్లో మిగిలిన వాళ్లు కవులుగా, రచయితలుగా కాస్త కాస్త పేర్లు తెచ్చుకుని చెలామణీ అవ్వసాగారు. దానికితోడు గురువుగార్ని వాళ్లు నిర్లక్ష్యం చేయడం కూడా చాలా బాధనిపించింది నాకు.

అందుకే బాగా ఆలోచించి మళ్లీ ఆయన్ని జనంలోకి తీసుకొచ్చి గొప్ప సన్మానాన్ని అపూర్వంగా చేయించి, ఆ సందర్భంగా కొంత పర్సును బహూకరించి ఆర్థికంగా ఆయన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నాను.

ఎవరి దగ్గర్నుంచీ ఏమీ ఆశించని గురువుగారు నా సంకల్పానికి ఒప్పుకుంటారన్న నమ్మకం మాత్రం నాకు ఏ కోశానా లేదు. అయినా, ఈ ఒక్క కోరికనూ మన్నించకపోతారా...!"

అనుకోవడమే తడవుగా నాకు బాగా పరిచయస్తుల దగ్గర, మిత్రుల దగ్గర ముందుగా మాట సహాయాన్ని తీస్కున్నాను. గురువుగారి సమకాలికులు, సానుభూతిపరులు ఒకరిద్దరు నా ప్రయత్నానికి మనస్ఫూర్తిగా ఆశీస్సులు అందించడంతో రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగిపోయాను. కార్యక్రమానికి ఎవరెవర్ని పిలవాలి? ముఖ్య అతిథిగా ఎవరిని ఆహ్వానించాలీ అని సాహిత్యాభిమానులతో సంప్రదిస్తూ చకచకా సాగిపోతున్న నాకు హృదయం బద్దలయ్యే వార్త అందడంతో హతాశుడనయ్యాను.

"పాంచజన్యగారు, చనిపోయారు!"

'సరస్వతీదేవి పుస్తకంలోనుంచి ఓ కాగితం రాలిపోయిందా?!'

విషణ్ణ వదనంతో, ఓడిపోయిన హృదయంతో గురువుగారి ఇంటికి చేరుకున్న నాకు ఆయన దేహాన్ని చూడగానే దుఃఖం ముంచుకొచ్చింది.

'ఎన్నో వేల భావాల్ని గుండెనిండా నింపుకుని, వాటిని కాగితంమీద పెట్టలేక తుది శ్వాస రూపంలో అనంత వాయువులకే వాటిని అంకితం గావించిన మహా రచయిత మరి లేరన్న కఠోర సత్యం అబద్ధమైతే ఎంత బాగుండు...'

'నా అంతరాల్లో జన్మించే భావాలకు, నాలో స్పందనలు రేకెత్తించే నిత్య సత్యాలకు, నేను కల్పించే అక్షర రూపానికి జీవం పోసే శిల్పిని పోగొట్టుకున్న నే నెంత శాపగ్రస్తుణ్ణి!

అంత్యక్రియలయ్యే వరకూ వాటిక దగ్గరే ఉండి, సంధ్య చీకట్లు ముసురుకునేవరకు ఒంటరిగానే ఉండిపోయాను.

ఆ నా ఒంటరితనంలో ఆయన్నెన్నోసార్లు బతికించుకున్నాను.

గురువుగారి ద్వారా రోజుకో విషయాన్ని తెలుసుకునే నేను, ఆయన లేకపోవడంతో విషయాలనేవే లేని వెర్రివాణ్ణయ్యాను. గురూజీ మెచ్చుకునే రీతిలో ఒక్క సబ్జెక్ట్ అయినా రాయాలని ఎంతగానో తపించిన నేను అలా రాయకుండా మిగిలిపోయాననే క్షోభననుభవించాను.

గురువుగారికంటూ ఉన్న ఆస్తి, ఆయన సేకరించిన గ్రంథాలు తన తదనంతరం వాటికి వారసుడిగా నన్ను మాత్రమే ఆయన ఏనాడో నిర్ణయించడంతో ఆ అనుభవాన్ని జ్ఞాపకం చేసుకుంటూ కొంతకాలం తరువాత ఆయనింటికి వెళ్లాను.

ఆయన లేని ఇల్లు చెదలు తినేసిన పుస్తకంలా అనిపించింది నాకు. బుద్ధుడు నిర్యాణం పొందిన తరువాత ఒంటరిగా మిగిలిపోయిన బోధివృక్షంలా అనిపించింది ఆ వేపచెట్టు. చెట్టుక్రింద నిలబడ్డ నాకు చెట్టు ఆకులు చేస్తున్న గలగల శబ్దాలు గురూజీ నాకు చెప్పకుండా మిగిల్చిన పాఠాన్ని చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్లుగా అనిపించాయి.


"శ్రీహర్షా!" అన్న పిలుపుతో ఆ వైపు తిరిగాను.

గురువుగారి ధర్మవత్ని.

"మేము ఊరొదిలి వెళ్లిపోతున్నాము, బాబూ!" అంది.

మనస్సు చివుక్కుమంది.

"మీ గురువుగారు ఆఖరుసారి నిన్నే



అడిగారు బాబూ!"

ఆ చివరి క్షణంలో ఆయన పక్కన లేనందుకు ఎంతగానో క్షోభించాను.

నెమ్మదిగా తేరుకుని నే నొచ్చిన విషయాన్ని ఆమెతో చెప్పాను.

"అయ్యో... ఆ పుస్తకలు నిన్ను తీసుకోమని చెప్పారు! ఈ నాలుగు రోజులూ ఎవరెవరో వచ్చి, మీ గురువుగారి పేరు చెప్పి వాటిని తీసుకువెళ్లిపోయారే!"

ఆమె మాటలు పూర్తికాకముందే ఒక్క ఉదుటున లోపలికి పరుగెత్తాను. లోపల ఖాళీ బీరువాలు వెక్కిరిస్తూ కనబడ్డంతో హతాశుడనైపోయాను.

"ఎంత మోసం!" చెప్పరాని ఉక్రోషంతో ఊగిపోయాను.


ఇన్నాళ్లుగా నే నెంతో అపురూపంగా చూసుకున్న గ్రంథాల్లో ఒక్కటి కూడా నాది కాకపోవడంతో దుఃఖం ముంచుకొచ్చింది. గబగబా ఇల్లంతా వెతికాను, కొన్ని పుస్తకాలైనా దొరక్కపోతాయా అన్న ఆశతో. ఇల్లు ఆ చివరి నుండి ఈ చివరికి ఇంటి చూరులో సైతం పిచ్చిపిచ్చిగా వెతికాను. మంచాల క్రింద, భోషాణం లోపల, మూలనున్న ట్రంకుపెట్టెలో వెర్రిగా వెదికాను. అణువణువూ వెదికినా ఆయన స్వీయ రచనలు సైతం దొరక్కపోవడంతో నిస్తేజంగా నిలబడిపోయి మౌనంగా రోదించాను.

"ఎప్పుడూ చదువుతూ ఉండాలి, చదువుతూ ఉండాలి, రాస్తూచదవాలి..." అనే గురువుగారి మాటలు ప్రతిధ్వనిస్తుండగా గుండెనిండా నిండుకున్న వేదనతో మరక్కడ ఉండలేక చివుక్కున వెనుదిరిగాను.

గడప దాటుతూ ఆ ఇంటితో నాకున్న అనుబంధాన్ని వదులుకుంటూ చివరిసారిగా వెనక్కి తిరిగి చూశాను. నా ఆశకు రూపమిచ్చినట్లుగా గదిలో ఓ మూలగా విసిరివేయబడి ఉన్న పాత డైరీ తళుక్కున మెరిసినట్లుగా కనబడడంతో ఆత్రంగా వెళ్లి దాన్నందుకున్నాను.

లోపల ఏముందోనని ఆత్రుతగా పేజీలు తిప్పిన నాకు నా పేరు కనిపించడంతో ఆశ్చర్యపోతూ అక్షరాలు వెంట పరుగెత్తాను.

"జనవరి 2. నేనూ, శ్రీహర్షా ఒక సాహిత్య సభలో పాల్గొనడానికి విజయవాడ వెళ్లాం. ఆ సభలో శ్రీశ్రీ మహాకవిగా కీర్తింపబడటానికి గల




నేపథ్యాన్ని శ్రీహర్ష గొప్పగా చెప్పాడు. ఆ ఉపన్యాసాన్ని నా శ్వాస ఆగేవరకూ మరచిపోగలనా?..."

నేను మహా కవి గురించి ఆయన కావ్యాలను విశ్లేషిస్తూ అరగంటసేపు అనర్గళంగా మాట్లాడిన విషయం గుర్తొచ్చింది నాకు. అప్పుడేమీ వ్యాఖ్యానించని గురువుగారికి నా ఉపన్యాసం నచ్చలేదనుకున్నాను.

"కానీ డైరీలో...?"

గురూజీ అంతరంగాన్ని మొట్టమొదటిసారిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఆశ్చర్యంగా పేజీ తిప్పాను.

"ఈ రోజు శ్రీహర్ష మరో కథ రాసుకొచ్చాడు. పెద్దగా బాగుండలేదన్నాను. పాపం, చాలా బాధపడ్డాడు. ఎప్పటికైనా మీరు మెచ్చేట్టు రాస్తాను, గురువుగారూ! అన్నాడు. మధ్యతరగతి జీవితాలకు ఆత్మీయానురాగాలే తరగని ఆస్తులుగా అతను ఆ కథను నడిపించిన శైలి ఎంతో అద్భుతంగా ఉంది. కానీ ఆ రచన బాగుందని చెబితే అతను అంతటితోనే సంతృప్తిపడిపోతాడని, అది అతని సాహిత్య గమనానికి అవరోధం అవుతుందని, అతని ఎదుగుదలను శాసిస్తుందని కష్టంగానే అయినా అబద్ధం చెప్పాను!...

"కానీ ఇంత చిన్న వయసులోనే ఎంత చక్కని విశ్లేషణ...?"

మరో పేజీలో...

"శ్రీహర్ష కవిత్వంలో ఎంత ఆలోచనుందో అంత అభ్యుదయం కూడా ఉంది. అతను నా శిష్యుడే కాదు, సాహితీ వారసుడు కూడా."

అబ్బురపడ్డాను. ఆ మహానుభావుడికి నేను వారసుణ్ణా...!

ఆ గౌరవానికి తట్టుకోలేకపోయాను. తరువాతి అక్షరాలు చదవడానికి తడబడ్డాను. చేతులు సన్నగా కనిపిస్తుండగా గురువుగారి కాంప్లిమెంట్‌కి చలించిన హృదయంతో గట్టిగా కళ్లు మూసుకున్నాను. గతంలో ఆయన్ని తిట్టుకున్నందుకు గట్టిగా చెంపలేసుకున్నాను.

ఆ తరువాతి పేజీలు ఎలా చదివానో నాకే తెలియదు. ప్రతి పేజీలోనూ నా రచనల గురించి విశ్లేషణే!

చివరగా ...

"శ్రీహర్ష నేను మెచ్చుకునే రీతిలో ఒక్క రచనైనా ఎప్పటికైనా రాస్తానన్నాడు. ఎప్పటికైనా ఏంటి? ఏనాడో రాశాడు. అతను రాసిన వాటిలో నాకు నచ్చనిదేముందసలు? భాషని ఎంతో చక్కగా ఉపయోగించుకుంటున్నాడు. ఇప్పటివరకూ అతన్ని అయిష్టంగానే నిరుత్సాహపరుస్తూ వచ్చాను. ఇప్పుడతన్ని పత్రికా ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది ..."

గురువుగారు ఇంతకాలం నన్నెందుకు నిరుత్సాహపరిచారో ఒక్కసారిగా అర్థమైంది నాకు. ఆయన అభిప్రాయాలకు వివశుణ్ణైపోయాను. నా చెక్కిళ్లు నాకు తెలియకుండానే తడయ్యాయి. గురుస్సాక్షాత్ పరబ్రహ్మకు నిజమైన అర్థాన్ని గ్రహించాను.

గురువుగారికి సన్మానం చెయ్యాలని ఎంతో ఆరాటపడ్డ నాకు ఆయనే దగ్గరకి తీసుకుని స్వహస్తాలతో నన్ను సన్మానం చేసినంతగా పొంగిపోయాను. ఎప్పుడూ కామెంట్స్ మాత్రమే చేసే ఆయన డైరీలో మాత్రం అన్నీ కాంప్లిమెంట్సే ఉండడంతో తెలియని భావోద్వేగానికి లోనయ్యాను. రెండు దశాబ్దాల క్రితం పాఠకావనిని తన సాహిత్య సౌరభాలతో ముంచెత్తిన ఆ మహనీయునికి జోహార్లు అర్పించాను.

"ఏ గురు దక్షిణ చెల్లించి ఆయన రుణం తీర్చుకోగలను?"

"ఒక మంచి రచన చేసి...!"

ఉలిక్కిపడి ఆ మాటలు వచ్చిన దిక్కుకు చూశాను.

ఎదురుగా గోడకు వేలాడుతున్న గురువుగారి ఫోటో నవ్వుతూ కనబడడంతో

"తప్పకుండా, గురువుగారూ!" అన్నాను ఆ డైరీని గుండెలకు హత్తుకుంటూ.

■